# మిడ్‌నైట్ ఛానెల్

**ఏదో పనిమీద తమ పోర్షన్ నుంచి బయటికొచ్చి అప్రయత్నంగా పక్క పోర్షన్‌లోకి చూసింది విజయ. ఓ క్షణం గతుక్కుమని మళ్ళీ లోపలకు అడుగు వేసింది. కాని ఆమె కళ్లు మాత్రం ఆ దృశ్యాన్నింకా చూడాలని ఆరాటపడ్తున్నాయి.**

పక్క పోర్షన్‌లో వయసు మళ్లుతున్న జంట తలుపులు వేసుకోకుండా పబ్లిగ్గా ఒకరి ఒళ్లో మరొకరు వాలిపోయి తన్మయత్వంలో వున్నారు. అతనామె చెవిలో గుసగుసలాడ్తున్నాడు. ఆమె పకపక నవ్వుతోంది.

''ఛీ పొండి. మీరు రోజురోజుకీ కుర్రాళ్ళయిపోతున్నారు. మరీ పోకిరీ మాటలు!'' అంటోందామె. చెవి మాత్రం అతని కందించే వుంది.

అతనామెను పొదివి పట్టుకున్నాడు. రెండు చేతులు ఆమె భుజాల చుట్టూ వేసి చంటిపిల్లనెత్తుకున్నట్టు ఒళ్లో కూచోబెట్టుకున్నాడు. ఆమె వగలు పోతూ అతని మెడ చుట్టూ అలవోకగా చేతులు వేసి అతని కల్లుకుపోయింది.

విజయ లోలోపల ఆ దృశ్యాన్ని చూడాలనేగాఢమైన కోరికను అదుపులో పెట్టుకోలేక కళ్ళప్పగించి చూస్తోంది. పైకి మాత్రం 'ఛీ, ఎంత బరితెగించిపోయారని? పట్టపగలే ఏమిటీ శృంగారం? పోనీ తలుపు వేసుకోవచ్చు కదా! అయినా వీళ్ళేమైనా కొత్త దంపతులా? అతనికి ఏభై అయిదేళ్లుంటాయి. ఆమెకు నాలుగైదేళ్లు తక్కువ వుండొచ్చు. మనమల్ని పెంచే వయసులో సరాగాలాడుకుంటున్నారు.

'వాళ్ళిద్దరు ఆ వయసులో కూడా అత్యంత అన్యోన్యంగా, ప్రేమగా ప్రణయ సామ్రాజ్యాన్ని యథేచ్ఛగా ఏల్తున్నారు. వాళ్ళదెంత అనుకూల దాంపత్యం! ఆమె ఎంత అదృష్టవంతురాలు!' విజయ మనసు అంతరంగాల నుంచి ఉబికిన ఆలోచన.

లోపల్నుంచి, ''ఏయ్, ఎక్కడ చచ్చావ్?'' అన్న వికృతంగా వినిపించిన పతిదేవుడి పెనుకేకకు ఉలిక్కిపడి లోపలకు పరుగెత్తింది విజయ.

''ఏంటీ, ఎక్కడ పాతుకుపోయావు? నాకు ఆఫీసుకి టైమయిపోయిందని తెలిసి కూడా పెత్తనాలకు పోయావా? మొగుడనే వాడికేవో అవసరాలుంటాయనే జ్ఞానమేడ్చిందా నీకు? నేను ఆఫీసుకు తగలడ్డాక నీ ఇష్టమొచ్చినట్టు ఊరేగు, ఎవడిక్కావాలి?'' రంకెలు వేస్తున్నాడు విశ్వం.

''ఎందుకండీ అలా అరుస్తారు? అవతల పదిమందికీ వినిపించాలా మన బాగోతం? ఏదో పనుండి ముందు గదిలోకి వెళ్ళాను. వంట పూర్తయింది, మీకు కేరియల్ సర్ది ఇచ్చెయ్యటమే! టిఫిన్ టేబిల్ మీద పెట్టాను, చూళ్ళేదా?'' అన్నది మెల్లగా విజయ.

''నేను పిలిస్తే అలించానంటావేంటి? ఏదన్నా అనేసరికి ఒంటి కాలిమీద లేచిపోతావ్! మొగుడన్నవాడు కోపమొచ్చి ఏదన్నా అనటం సహజం. అంత మాత్రాన మాటకు మాట సమాధానం చెప్తావా? నీకు పొగరెక్కువయ్యింది.''

''బాబూ, ఇక ఆపండి మీ గొడవ! నోరు తెరవటం పాపమైపోతోంది. పరువు వీథిలోనే వుంటుంది. సిగ్గుతో చచ్చిపోతున్నాను'' విజయ కంఠం రుద్ధమైపోయింది.

అపటిగ్గాని శాంతించడు విశ్వం. అయినా ఇంకా ఏదో గొణుక్కుంటూనే వున్నాడు ఆఫీసుకు వెళ్ళే వరకు. అతని తిరస్కారాన్ని భరించే శక్తి ఆమెకు లేదు. అందుకే పళ్ళ బిగువున అవమానాన్ని భరిస్తూ తన పని చేసుకుపోతుంటుంది.

ооо

సాయంత్రం తమ పోర్షన్ మెట్లెక్కుతూ పక్క నుంచి కిలకిలమంటున్న శబ్దం వినిపించి అప్రయత్నంగా అటు చూశాడు విశ్వం.

పక్క పోర్షన్‌లో వుంటున్న నడివయసాయన భార్యని తరుముతున్నాడు. ఆమె గదిలో పరుగులు పెడుతోంది. అతను ఆమెను పట్టుకోలేక అవస్త పడుతున్నాడు. ఆమె కిలకిల నవ్వుతూ చలాకీగా పరుగులు తీస్తూనే వుంది. అలాగే కొద్ది క్షణాలు చూస్తూ వుండిపోయాడు విశ్వం.

ఎంత హుషారుగా ఉన్నారీ దంపతులు!? వీళ్ళకు చీకు చింత, సమస్యలు ఏవీ లేవా? వీళ్ళను ఆర్థిక సమస్యలు బాధించవా? ఈ వయసులో కూడా వీళ్ళింత చలాకీగా వున్నారు!? జీవితాన్నెంత హాయిగా అనుభవిస్తున్నారు!?

ఈలోపల ఆయన ఆమెను ఒడిసి పట్టుకున్నాడు.

''అమ్మ దొంగా, నన్ను తప్పించుకుని పారిపోదామనే! చూడు, నిన్నేం చేస్తానో!'' అంటూ ఆమెను బలంగా సందిట సంబంధించి గాఢంగా గుండెలకు హత్తుకున్నాడు.

''హమ్మో... ఊపిరాగిపోతుంది మహానుభావా, ఏమిటా దూకుడు?'' అంటూ గువ్వలా అతని గుండెల్లో వెచ్చగా ఒదిగి పోయిందామె.


వాళ్ళిద్దరు బయటి ప్రపంచాన్ని పట్టించుకున్నట్టే లేదు. వాళ్ళది వేరే ప్రపంచం. ప్రణయ సామ్రాజ్య పరిధుల్ని కూడా అధిగమించి యథేచ్ఛగా తయారైన ప్రపంచంలో తలమునకలై వున్నారు.

ఓ క్షణం- విశ్వం మనసులో ఆ దృశ్యం ఓ మనోహర దృశ్య కావ్యంలా నిలిచిపోయింది.

''వీళ్ళెంత అదృష్టవంతులు! తను, విజయ ఎందుకిలా స్వేచ్ఛగా హాయిగా జీవించలేకపోతున్నారు? ఎందుకని?! అతని మనసులో ఏదో

# పక్కింటి సరసాలు

బొమ్మిడి అచ్చారావు



అసంతృప్తి, వెలితి.

తల తిప్పుకుని మెట్లెక్కి తలుపు తట్టాడు. అప్పుడు కూడా అలవోకగా ఆ దృశ్యాన్ని దొంగ చూపులు చూస్తూనే వున్నాడు.


తలుపు తెరవటం కొద్ది క్షణాలు ఆలస్యమయింది.

విజయ తలుపులు కొద్దిగా తెరచి బయటకు చూసి, ఆ తర్వాత బోర్లా తెరిచింది. విశ్వంలోని రాక్షసుడు మళ్ళీ విజృంభించాడు.

''ఏం, మొగుడొచ్చే సమయానికి కాస్త వీథిలో నిల్చుని ఎదురు చూస్తే ఏంపోయింది? అయినా మనసులో నాపట్ల ఏమైనా గౌరవముంటే కదా! నేనెంత కావాలనుకుంటే మాత్రం, అవతలి వాళ్ళ నుంచి కూడా రెస్పాన్స్ వుండాలి కదా! ఏనాడో చేసుకున్న ఖర్మ!'' కొంత పైకి మరికొంత స్వగతంలా అతని వాక్ప్రవాహం వరదలా పొంగుతూనే వుంది.

విజయ ఏం మాట్లాడలేదు. నీటికి నాచు తెగులు, మాటకు మాట తెగులు! ఆమె అతనితో వాదించి లాభంలేదని తెలిసినది కావటం వల్ల మౌనంగా అతని వెనుకనే లోనికొచ్చింది.

పెళ్ళయిన కొత్తల్లో చక్కగా అలంకరించుకుని, సాయంకాలం అతని కోసం క్షణమొక యుగంలా ఎదురు చూస్తుంటే, అతను గుమ్మంలో నిల్చున్న తన వంక కోపంగా చూస్తూ ''గుమ్మంలో నిల్చుని వీథిన పోయే వాళ్ళను చూడటం తప్ప నీకు పనిలేదా? నాకిలాంటివి నచ్చవు'' అన్నాడు ముఖం గంటు పెట్టుకుని.




తను నిర్ఘాంతపోయింది. ''నేను ఎదురు చూసు_న్నది మా కోసమే నండీ!'' అన్నది సౌమ్యంగా

''కాని బయటి వాళ్ళకు అలా అనిపించక పోవచ్చు'' అన్నాడు కఠినంగా.

తనకు దుఃఖం తన్నుకుంటూ వచ్చింది. బల వంతాన నిగ్రహించుకున్నది. ఆ క్షణంలోనే మనసులో దృఢంగా నిర్ణయం చేసుకున్నది- ఇక జన్మలో ఎన్నడూ అతని కోసం గుమ్మంలో ఎదురు చూడకూడదని!

ఇప్పుడు, దాదాపు మూడేళ్ళ తర్వాత ఇతను కొత్తగా మాట్లాడుతుంటే నవ్వొచ్చిందామెకు. ఇంకా ఇలగే శూలాల్లాంటి మాటలతో తూట్లు పొడు స్తూనే వుంటాడు రాత్రి పడుకునే వరకు!

ООО

ఇల్లు సర్దుకుని పడ్డగదిలోకి వచ్చేటప్పటికి విశ్వం అటు తిరిగి పడుకున్నాడు.

విజయ మౌనంగా పక్కమీద వాలింది.

విశ్వం ఇంకా గోడవైపు ముఖం పెట్టుకునే వున్నాడు. విజయ మెల్లగా అతని పక్కకు జరిగి అతన్ని ఆనుకుని పడుకున్నది. అప్పటికీ అతనామెను పలకరించలేదు. ఆమె అతని భుజం మీద తల పెట్టుకుంది.

అతనామె తలను పక్కకుతోసి ''రేపు ఏడు గంటలకే ఆఫీసుకు వెళ్ళాలి. నాకు నిద్రొస్తోంది'' అన్నాడు కట్టెవిరిచినట్టు.

విజయ ఆత్మాభిమానం దెబ్బతిన్నది. తను మరో పక్కకు తిరిగి పడుకున్నది.

సరిగ్గా అప్పుడే పక్కగదిలో నుంచి కిలికిల నవ్వులు, గుసగుసలు ఆమె చెవిన పడ్డాయి. వినకూడ దనుకుంటూనే వినటం మొదలెట్టింది.

''ఉష్. ఏమిటిది? అక్కడెందుకు తడుము తున్నారు?'' అన్న సన్నని గొంతు - పక్క పోర్షన్ కళ్యాణిది.

''నా ఇష్టం! నీ ఒంట్లోని అణువణువును తడిమే హక్కు నా చేతికుంది. దాన్ని అడ్డగించే అధికారం నీకు లేదు'' అతని గొంతులో అదోరకమైన మార్ద వం, మత్తు పలికాయి. కళ్యాణి సన్నగా కేక పెట్టింది. ''ఛీ, చేతికి హక్కుందని గోళ్ళను కూడా గుచ్చె య్యాలా? అమ్మో, నొప్పి! గీరుకుంది'' అన్నది.

''నోటి మీటలు, పంటి నొక్కులు, పెదవి ముద్రలు, సరస సల్లాపాలు - ఇవన్నీ అసలు కార్యక్ర మానికి ముందు జరిగి తీరాల్సిన ఫార్మాలిటీస్! ఇందాకటికన్న ఇప్పుడు పరిస్థితి కొంచెం బెటరేనా కాదా, చెప్పు!''

''ఛీ, మీతో మాట్లాడకూడదు. అన్నీ పోకిరీ మాటలు! అలా మాట్లాడటానికి మీకు సిగ్గెయ్యదో, ఏమిటో మరి!''

''సిగ్గా? సిగ్గెందుకు? సమస్త జీవరాశి ఆహార మైథునాల్ని తప్పకుండా పాటిస్తాయి. మనమూ జీవ రాశుల్లోని ఓ అంశమే కదా బాలామణీ!''

''ఇది ఉపన్యాసాలిచ్చే టైమా, మహాశయా!''

''అందుకే, నా పనేదో నేను చూసుకుంటుంటే మధ్యలో అడ్డుపెడతావేం? అనుభవజ్ఞుడైన వైణికుడు తన వీణ మీద ఎక్కడ ఏ స్వరం పలికించాలో అద్భి కళ్లు మూసుకుని కూడా పలికించగలిగినట్టే, భార్య శరీరంలో ఎక్కడ ఏ స్థానంలో, ఎంత స్థాయిలో ఏ నరాన్ని మీటాలో భర్తకి తెలుసుండాలి. అప్పుడే తన భార్యకు న్యాయం చెయ్యగలడు.''

''ఊ, అందుకేనేంటి చేతి వేళ్ళకూ పని చెప్తున్నారు? మధ్య మధ్య పెదాలిక్కూడా పని చెప్పాలా?''

''ఇంకా చాలా వాటికి పని చెప్పాలి. ఇప్పుడు కళ్ళకి!''

''ఒళ్ళంతా కళ్లు చేసుకుని అలా చూస్తారేమిటి? ఛీ, మీకు సిగ్గులేదు, నాకు సిగ్గేస్తోంది బాబూ!''

''నీకు సిగ్గేస్తే కళ్లు మూసుకో! నాకు మాత్రం నీ శరీరంలోని ఒంపులన్నీ లెక్కపెట్టకపోతే తోచదు. వయసు పెరిగే కొద్దీ నీలో లావణ్యం, అందం ద్విగుణీ కృతమవుతున్నాయి సుమా!''

''మీకు మాత్రం వయసు పెరిగే కొద్దీ కొంటెతనం, కోరికలు నాలుగురెట్లు పెరుగు తున్నాయి కదా! మరీ కుర్రతనమెక్కువైపోయింది... ఆ, ఆ... ఆడవాళ్లు పూలతో సమానం స్వామీ, మొరటుతనం పనికిరాదు.''

''కొద్ది క్షణాల తర్వాత, ఖచ్చితంగా మొరటు గానే వుండాలని మనసు తనువు కూడా తహతహ లాడుతాయి. ఇప్పుడెలా వుంది? ఇప్పుడు కూడా మొరటుగానే వుందా?''

''ఛీ, మీకు సిగ్గులేదు. అవన్నీ నోటితో చెప్పు కుంటారా? మూమెంట్స్‌ని బట్టి అర్థం కావటం లేదా?''

''భార్యా భర్తల మధ్య అరమరికలు, సిగ్గు ఎందుకు ప్రియతమా! నీకెలాగైతే బావుంటుందో సంకోచం లేకుండా నాకు చెప్పాలి. ఇద్దరం కలిసి సమానంగా అనుభవించే సుఖం - ఇద్దరు ఒకరికొకరు స్వచ్ఛందంగా సహకరిస్తేనే కదా సాధ్యమయేది!''

''మళ్ళీ ఉపన్యాసమందుకోకండి. ఇష్... గడ్డం గుచ్చుకుంటోంది. నున్నగా షేవ్ చేసుకోమని ఎన్ని సార్లు చెప్పాను!?''

''నున్నగా షేవ్ చేసుకోకూడదు. ఈ గడ్డం వల్ల కూడా నీకు కొన్ని సందర్భాల్లో చాలా లాభ ముంటుంది.''

''ఛీ, మరీ బరితెగించిపోయారు.''

''ఈ సమయంలో బరితెగించి పోవటం చాలా అవసరం కూడా. ... ఓసారి లైటు వెయ్యనా?...''

''ఒద్దొద్దు... అలా చేస్తే నేను వారం రోజుల పాటు మీకు దొరకనంతే!''

''నోనో... అంత శిక్ష భరించలేను. వారం రోజుల విరహమే! నిన్ను వదిలి పది క్షణాలు కూడా

వుండలేను''.

ఆమె కిలకిల నవ్వుతోంది. అతనేదే చేస్తుంటే ప్రతిస్పందనగా ఆమె గిలిగింతలతో నవ్వుతోంది.

ఇదంతా వింటున్న విజయ శరీరంలో అదో రకమైన అలజడి! ఆ దృశ్యం తన కళ్ళముందే సజీవంగా కనిపిస్తున్న భ్రాంతి కలుగుతోంది - ఆ జంట మాటలు వింటుంటె. ఆమె శరీరం రోమాంచిత మవుతోంది.

పక్కకు తిరిగి భర్త వంక చూసింది విజయ.

విశ్వం కూడా పక్కమీద అసహనంగా కదులుతున్నాడు. అతను మెలకువగానే వున్నాడని, అతను కూడా పక్క పోర్షన్‌లో జరుగుతున్న రసవత్తర సన్నివేశాన్ని మనసులోనే ఆనందిస్తున్నాడని అతని మూవ్‌మెంట్స్ బట్టి తేలిగ్గానే గ్రహించిందామె.

సరిగ్గా అప్పుడే, ''అబ్బ... నొప్పి...'' అన్న మాటలు కొంచెం తీవ్రస్థాయిలోనే వినిపించాయి ఆ గదిలోని ఇద్దరకు.

''ష్... అలా అరుస్తావేం? ఇక్కడేదో జరక్కూడనిది జరిగిపోతున్నదని చుట్టుపక్కల వాళ్లు పరుగెత్తుకు రాగలరు...'' అంటున్నాడతను నవ్వుతూ.

ఆమె కూడా మెల్లగా నవ్వింది.


ఆ తర్వాత అట్నుంచి ఎలాంటి మాటలు లేవు.

కొద్ది క్షణాలు పూర్తి నిశ్శబ్దం.

విశ్వం మెల్లగా భార్య వైపు జరుగుతున్నాడు. విజయ కూడా అప్రయత్నంగా అతని వైపు జరిగింది.


సరిగ్గా అప్పుడు పక్క పోర్షన్ నించి మళ్ళీ మాటలు వినిపించాయి. అవి తమగురించేనని విజయ, విశ్వం గ్రహించి జాగ్రత్తగా వింటున్నారు.

''మన పక్క పోర్షన్ మొగాయనే అస్తమాటు




భార్యను తిడుతూనే వుంటాడు. పాపం ఆమె మౌనంగా అన్నీ భరిస్తూనే వుంటుంది. ఇద్దరు మంచి వయసులో వున్నారు. ఎంతో సరదాగా హాయిగా అన్యోన్యంగా ఉండాల్సింది పోయి చీటికి మాటికి ఒకరినొకరు నిందించుకుంటూ బంగారం లాంటి జీవితాన్ని బండలపాలు చేసుకుంటున్నారు'' అన్నది కళ్యాణి.

ఆమె భర్త మాటలు వినిపించాయి. ''వాళ్ళిద్దరి మధ్య సదవగాహన లేదని నా అనుమానం. ఎప్పుడైనా ఏదైనా కీచులాటలు భార్యా భర్తల మధ్య సహజమే గాని, నిత్యం గొడవలు పడే భార్యాభర్తలు జీవితంలో చాలా మధురమైన క్షణాల్ని నష్టపోతున్నారనే చెప్పాలి.




యవ్వనం భగవంతుడు మనిషికిచ్చిన వరం. దాన్ని సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత మనిషిది. నిత్యం సమస్యల వలయంలో చిక్కుకుని బతుకును భారం చేసుకోవటం స్వయంకృతాపరాధం!''

''ఆ పిల్ల భర్త వల్ల సుఖపడటం లేదేమోనని నా అనుమానం. ఆ అమ్మాయిని చూస్తే జాలేస్తుంది.''


''పగలంతా ఒకర్నొకరు నిందించుకుని గొడవలు పడే భార్యా భర్తలెందరో చీకటి పడేసరికి పడ్గగదిలో రాజీపడిపోతారు; రాజీపడిపోవాలి కూడా. అమూల్యమైన మధుర క్షణాల్ని సొంతం చేసుకోవాలని ఏ జంట కనిపించదు!? పైగా విరహంలో రెండు రోజులు బాధపడి మూడోరోజున కలిసే సంయోగంలో ఎంతో సుఖం, థ్రిల్ వుంటాయి. ఆ థ్రిల్ కోసమని, కావాలనే వాళ్లు ఎడమొహం పెడమొహంగా వుంటున్నారేమో!?''

''నాకు మాత్రం అలా అనిపించటం లేదు కళ్యాణీ! ఇద్దరకు ఆర్థిక సమస్యలేం వుండవనుకుంటాను - పిల్లల్లేరు గనక! పోనీ ఇష్టంలేని పెళ్ళా అంటే, ఆ అమ్మాయి భర్త గురించి ఒక్క మాట కూడా చెడుగా చెప్పదని, తమది పెద్దలు కుదిర్చిన పెళ్ళని, ఆయన తనను బాగా చూసుకుంటున్నారని - నీతో చెప్పిందని నాతో అన్నావు కదా!''

''అవునండీ, ఆమె మాటల్ని బట్టి భర్త మీద చాలా ప్రేమానురాగాలున్నాయని గ్రహించాను''

''మరయితే, రాత్రిళ్లు సఖ్యంగా హాయిగా సంసారం చేసుకుంటున్నారేమో, మనం చూడొచ్చామా!'' అతను విషయాన్ని తేల్చెయ్యబోయాడు.

''లేదండి, అతను రెండు మూడు సార్లు రాత్రిళ్లు




కూడా భార్యను కసురుకోవటం, ఏదో సాకు చెప్పి గుర్రుపెట్టి నిద్రపోవటం స్పష్టంగా విన్నాను. గోడే కదా అడ్డు!

''అందర్నీ వదులుకుని భర్తే సర్వస్వమని భర్తతో అత్తింట అడుగుపెట్టే ఆడదాన్ని లాలించి సమాదరించి గుండెల్లో పెట్టుకుని కాపాడవలసిన భర్తే క్రూరంగా, రాక్షసంగా, అమానుషంగా ప్రవర్తిస్తే, ఆ ఆడపిల్లకెవరు దిక్కు - భగవంతుడు తప్ప!?''

ఈ మాటలన్నీ స్పష్టంగా విన్నాడు విశ్వం.

అతనిలోని మానవుడు మేల్కొన్నాడు. ఇంత కాలంగా మాటలతో విజయనెందుకు హింస్తున్నాడు తను? ఆమె పట్ల ఓ మంచి భర్తగా ఎప్పుడైనా ప్రవర్తించాడా? ఆమెకు సుఖసంతోషాలనిచ్చాడా? ఎన్నోసార్లు అనురాగంతో, ప్రేమతో తన పక్కలోకొచ్చిన భార్యను అకారణంగా ఈసడించుకుని విసుక్కొని దూరం చేసుకున్నాడే! ఎందుకిలా చేశాడు తను? ఆమె మీద కక్ష, లేక సాధింపా, లేక శాడిజమా? అందంలోను, గుణంలోను, వినయ విధేయతలలోను విజయ ఎన్నోవిధాల సగటు స్త్రీకన్న ఓ మెట్టు పైనే వుంది.

తమ పక్క పోర్షన్‌లో పదిరోజుల క్రితం దిగిన ఆ దంపతులిద్దరు తన కళ్లు తెరిపించారు. వయసు మళ్ళిపోతున్న ఆ దంపతుల మధ్య ఇంకా యవ్వనం మాత్రం మళ్ళిపోకుండా సజీవంగా వుంది. వయసులో వున్న తమ దంపతుల మధ్య యవ్వనం వాడిపోయి వయసు మళ్ళిపోతోంది. ఎక్కడుంది తేడా? ఎవరు దీనిక్కారణం? తనే... ముమ్మాటికీ తనే!

విశ్వం ఒక్కసారిగా విజయను తన మీదికి లాక్కుని బలంగా సందిట్లో బంధించాడు.

విజయ తన కళ్ళను తనే నమ్మలేక పోయింది. నిజంగా భర్తలో ఇంత మార్పు వచ్చిందా? లేక పక్క పోర్షన్ దంపతుల మాటలు అతన్ని ప్రభావితం చేశాయా?

విశ్వం భార్యను బిగి కౌగిలిలో బంధించి ఉక్కిరి బిక్కిరి చేసేశాడు. ముద్దులతో ముంచెత్తివేస్తూ ఆమె శరీరంలో అగ్ని రగుల్కొలిపాడు.

విజయ ఉక్కిరిబిక్కిరైపోతూ, ''ఏమండీ, నేనేమైపోతున్నాను?'' అంటూ భర్తను లతలా అల్లుకుపోయి ఆనందంగా, తృప్తిగా అతని కౌగిట్లో కరిగిపోతోంది.

కోరిక ఇరు శరీరాలను కొలిమిలా మండిస్తుంటే మరో మాట లేకుండా ఇద్దరు మన్మథసామ్రాజ్యాన్ని యథేచ్ఛగా ఏలటంలో నిమగ్నమై పోయారు.

పెళ్ళయిన తర్వాత మొదటిసారిగా భర్త నుంచి నిజమైన సుఖాన్ని, ఆనందాన్ని పొందింది విజయ ఆ రాత్రి.

ఆమె మనసు పక్క పోర్షన్‌లోని దంపతుల పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది.

ooo

మర్నాడు భర్త ఆఫీసుకు వెళ్తుంటే దగ్గరుండి పంపిస్తున్న విజయను, గుమ్మం మెట్లు దిగుతున్న విశ్వం, మళ్ళీ మెట్లెక్కి వెనక్కి వచ్చి భార్యను దగ్గరకు తీసుకుని ఆమె సిగ్గుతో మెలికలు తిరిగిపోతుంటే నవ్వుతూ ఆమెను వదిలి వెళ్ళటం - పక్క పోర్షన్‌లో నుంచి చూసిన కళ్యాణి, భర్తను పిలిచి ఆ దృశ్యాన్ని చూపించింది.

''నిస్సందేహంగా వారి సంసార జీవితం చక్కపడినట్టే! వారిద్దరి మధ్య అసలైన సాన్నిహిత్యం, భార్యాభర్తల అనుబంధం ఈరోజే స్పష్టంగా చూస్తున్నాం'' అన్నాడాయన.

కళ్యాణి విజయను సమీపించి చిన్నగా నవ్వింది.

విజయ సంభ్రమంగా, ''లోపలకు రండి పిన్నిగారూ!'' అంటూ ఆహ్వానించింది.

''రాత్రి నిద్రపోలేదేమిటమ్మా, కళ్లు భారంగా వున్నాయి!'' అంటూ గుంభనంగా నవ్వింది కళ్యాణి.

విజయ సిగ్గుగా నవ్వి, ''తెలియకుండానే మీరు నా జీవితంలో వసంతం తీసుకొచ్చారు పిన్నిగారూ! ఇన్నాళ్లు మావారు నా పట్ల ఉదాసీనంగా వుండేవారు. రాత్రి నుంచి...'' అంటూ సంకోచంతో ఆగిపోయింది.

''నాకంతా తెలుసునమ్మా! నేను, మా వారు ఆడిన నాటకం ఫలించింది. మీ సంసారం చక్కపడింది. మీ ఆయన నిన్నాదరించాడు, అంతే చాలు!'' అన్నది కళ్యాణి విజయ తలనిమిరి.

విజయ కళ్లు పెద్దవయ్యాయి ఆశ్చర్యంతో.

''నాటకమేమిటి పిన్నిగారు...!?''

''అవునమ్మా, చిన్న నాటకం! నిన్ను మీ ఆయన దూరంగా ఉంచటం, అసహ్యించుకోవటం, నువ్వు మూగగా రోదించటం - అన్నీ పది రోజులుగా నేను, మీ బాబాయి గమనించాం. మీ ఇద్దరిలోను మార్పు తీసుకొని రావటానికి, కావాలనే తలుపులు తెరిచి వుంచి, నేను, మీ బాబాయి మితిమీరి ప్రవర్తించేవాళ్ళం. నువ్వు, మీ ఆయన చూడటం కోసమే అదంతా... రాత్రిళ్లు కూడా మీకు వినపడాలనే గట్టిగా మాట్లాడుతూ విపరీత సంభాషణలు చేసేవాళ్ళం. పోయిన రాత్రి నువ్వు, మీ ఆయన కూడా మా మాటలకు ప్రతిస్పందించటం, తద్వారా మీ ఆయనలో మేం కోరుకున్న మంచి మార్పు రావటం - మాకెంతో ఆనందంగా వుంది. లేకపోతే పొద్దు రాలిపోతున్న ఈ వయసులో మేము బరితెగించి ప్రవర్తిస్తామా? ఇదంతా నీ సుఖం కోసమే తల్లీ! మేం పోగొట్టుకున్న మా అమ్మాయిని నీలో చూసుకుంటున్న మేము - నీ సుఖం కోసం ఇదంతా చేశాం.

''మా ఒక్కగానొక్క కూతుర్ని మా అల్లుడు బలి తీసుకుని మా దంపతుల గర్భంలో చిచ్చు రగిలించాడు తల్లీ! మరో అమ్మ కన్న బిడ్డ జీవితం అలా కాకూడదనే ఇదంతా చేశాం...'' చెప్పింది కళ్యాణి. ఆమె గొంతు గద్గదమైంది.

చేతులెత్తి ఆ మాతృమూర్తికి భక్తిపూర్వకంగా నమస్కరించింది విజయ.